సాక్షి గుంటూరు


గురువారం । 10 । అక్టోబర్ । 2024

I




పులిచింతల ప్రాజెక్టు నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి బుధవారం ఎగువ నుంచి 32,364 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 30,247 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 588.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 10,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 7026 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

చదువుల తల్లిగా బాలచాముండేశ్వరీదేవి



అమరావతి: శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్స వాలలో భాగంగా అమరావతి శ్రీ బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో మూలా నక్షత్రం సందర్భంగా బుధవారం అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తుల పూజలందుకున్నారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవీ ఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీ చక్రార్చన పూజలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దిని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు జరిపారు.

14 నుంచి పల్లె పండుగ

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్ : జిల్లాలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు పల్లెపండుగ- పంచాయతీ వారోత్సవాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఆమె అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఇప్పటికే మంజూరైన పనులను శంకుస్థాపనలు చేయాలన్నారు. ఈ పనులన్నీ సంక్రాంతి పండుగలోపు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఈ పనుల్లో భాగంగా జిల్లాలో 114 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద రూ.13.93 కోట్లతో రహదారులు, డ్రైన్ల ఏర్పాటు, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి 160 వాటికి పరిపాలనా ఉత్తర్వులు జారీ చేశానన్నారు. శంకుస్థాపనలకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో జడ్పీ సీఈఓ జ్యోతి బసు, డ్వామా పీడీ శంకర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌తో భేటీ


జాతీయ పర్యవేక్షక బృందం సభ్యులు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు జిల్లాకు వచ్చిన ప్రిన్సిపల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సూర్యకాంత ప్రదాన్, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ అశోక్ కుమార్ సాహూ తదితరులు కలిశారు. బృంద సభ్యులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమాచారాన్ని అందించాలని సిబ్బందికి తెలిపారు.

'కశ్మీర్ యూత్ ఎక్స్ఛేంజ్'కు ఏర్పాట్లు చేయాలి



గుంటూరు వెస్ట్: ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న కశ్మీర్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ.. కశ్మీర్‌లోని 6 జిల్లాల నుంచి 132 మంది యువత ఇందులో పాల్గొంటారన్నారు. వీరికి ఏఎన్‌యూలో బస ఏర్పాటు చేయాలన్నారు. పూర్తి స్థాయి రక్షణ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమావేశంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా క్రికెట్‌లోకి మంగళగిరి యువతి



వాసవి అఖిల పావని

మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా క్రికెట్‌లో మంగళగిరి యువతి ప్రతిభ చాటింది. ఈ నెల 17వ తేదీన బరోడా వేదికగా జరిగే ఇండియా సీనియర్ మహిళా క్రికెట్ టీ20 టోర్నమెంట్‌లో పాల్గొనే టీమ్‌లో మంగళగిరికి చెందిన వాసవి అఖిల పావనిని సెలక్షన్ టీమ్ ఎంపిక చేసింది. గత నెల ఢిల్లీలో జరిగిన ఢిల్లీ క్యాపిటల్స్ ఉమెన్ ఐపీఎల్ టీమ్ సెలక్షన్ ట్రయల్స్‌కి పావని హాజరైంది. వాసవి పావనిని పలువురు ప్రముఖులు క్రీడాకారులు అభినందించారు.



బుధవారం తెల్లవారుజామున మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కంపార్ట్‌మెంట్ వద్ద వేచి ఉన్న భక్తులు, (ఇన్‌సెట్)సరస్వతీ అలంకారంలో దుర్గమ్మ

అడుగులు వడివడిగా.. ఇంద్రకీలాద్రి నిండుగా.. భక్తజనం ఉప్పొంగగా.. అందరి మదిలో అమ్మ రూపం అపురూపంగా కొలువుదీరింది. బుధవారం దుర్గమ్మ జన్మ నక్షత్రం మూలానక్షత్రం కావడంతో దారులన్నీ ఇంద్రకీలాద్రి వైపు నడిచాయి. సరస్వతీదేవి అలంకారంలో దుర్గమ్మ తన బిడ్డలకు దర్శనమిచ్చింది. భక్తజనం మదిలో దివ్యానందం నింపింది. ఉదయమంతా భక్తి పారవశ్యం, సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలతో ఇంద్రగిరి మెరిసిపోయింది.

విద్యాధరి.. భక్తఝరి

సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మకు నీరాజనం

- మంగళవారం అర్ధరాత్రి నుంచే బారులు తీరిన భక్తులు
- 21 గంటల పాటు అమ్మవారి దర్శనం
- చదువుల తల్లికి పలువురు ప్రముఖులు పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో ఏడో రోజు దుర్గమ్మ శ్రీ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం అమ్మవారి జన్మనక్షత్రం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని సరస్వతీదేవిగా దర్శించుకున్నారు. బుధవారం తెల్లవారుజామున 00.50 అమ్మవారికి సరస్వతీదేవి అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం దర్శనం ప్రారంభమైంది. అమ్మవారిని సరస్వతీదేవిగా సీఎం చంద్రబాబునాయుడు దంపతులు దర్శించుకుని పట్టువస్త్రాలను సమర్పించారు. డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేష్ దంపతులు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ, ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖర్‌బాబు, ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఈవో కేఎస్ రామరావు దంపతులతో పాటు దేవదాయ శాఖకు చెందిన పలువురు అధికారులు దర్శించుకున్నారు.

పోలీసుల అతి..

మూలా నక్షత్రం కావడంతో దేవస్థానం టికెట్ల విక్రయాలను రద్దు చేసి అన్ని క్యూలైన్‌లోనూ భక్తులను ఉచితంగా అనుమతించారు. ఘాట్‌రోడ్డులో కొండపైకి వస్తున్న భక్తులను పోలీసులు నియంత్రించే క్రమంలో తోపులాట చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఓ మహిళకు పోలీసు అధికారి చేయి బలంగా తగలడంతో ఆ భక్తురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు వినాయకుడి గుడి అన్ని క్యూలైన్లు కిటకిటలాడాయి. సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు అమ్మవారికి మహా నివేదన, పంచహారతుల నేపథ్యంలో గంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో క్యూలైన్‌లో రద్దీ మరింత పెరిగింది. రాత్రి 12 గంటల వరకు భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించామని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రికార్డు స్థాయిలో అమ్మవారి దర్శనం కల్పించినట్లయింది. అమ్మవారికి బాలభోగ నివేదన, మహా నివేదన, పంచహారతుల సమయం మినహాయిస్తే 21 గంటల పైగా అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించామని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.



అమ్మవారి దర్శనానికి భక్తుల క్యూ

ఆర్జిత సేవలలో ఉభయదాతలు

మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక ఖడ్గమాలార్చన, ప్రత్యేక లక్ష కుంకుమార్చన, ప్రత్యేక శ్రీచక్రనవార్చన, ప్రత్యేక చండీహోమంలో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దేవస్థానం ఘాట్‌రోడ్డు మీదగా వచ్చే అన్ని వాహనాలను నిలిపివేసింది. ఉభయదాతల కోసం గాం. దీజీ మున్సిపల్ హైస్కూల్, పున్నమీ, భవానీ ఘాట్ల నుంచి దేవస్థానం బస్సులను నడిపింది. దీంతో ఉభయదాతలు దేవస్థాన బస్సులలో కొండపైకి చేరుకుని ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. వీఐపీల పేరిట వచ్చే వారిని పూర్తిగా కట్టడి చేశారు. క్యూలైన్ బయట నుంచి ఎవరూ కొండపైకి చేరుకోకుండా పోలీసులు ఘాట్‌రోడ్డులో పలు చోట్ల స్కానింగ్ చేయడంతో క్యూలైన్లలో భక్తులు త్వరత్వరగా అమ్మవారిని దర్శించుకున్నారు.

కన్నుల పండువగా..

శ్రీగంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి నగరోత్సవ సేవ బుధవారం కన్నుల పండువగా సాగింది. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల నుంచి ఊరేగింపును ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభించారు. ఆది దంపతులు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై కొలువై ఉండగా, మేళతాళాలు, మంగళవాయిద్యాల, భక్త జనుల కోలాట నృత్యాల మధ్య నగరోత్సవ సేవ అంగరంగ వైభవంగా సాగింది. మహా మండపం, కనకదుర్గానగర్, రథం సెంటర్, కెనాల్‌రోడ్డు, ఘాట్‌రోడ్డు మీదగా ఆలయానికి చేరుకుంది. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద దేవతా మూర్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



నగరోత్సవంలో ఉత్సవమూర్తులు



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు, లోకేష్ దంపతులు

సీఎంకు స్వాగతం

దుర్గమ్మకు పట్టువస్త్రాలను సమర్పించేందుకు విచ్చేసిన సీఎం చంద్రబాబు నాయుడికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సాదరంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడు దంపతులను కలెక్టర్ సృజన మర్యాద పూర్వకంగా కలిశారు.



గుంటూరులోని శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో బుధవారం సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

'క్లీన్' గ్రేస్

ప్లాన్‌లకు అనుగుణంగా ఎప్పటికప్పుడు అన్ని అనుమతులు

- గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ సముదాయంపై అసత్య ప్రచారం తగదు
- నిర్మాణ రంగంలో 'షార్ట్ ఫాల్' సర్వసాధారణమే
- మున్సిపల్ కార్పొరేషన్‌కు అన్ని రకాల ఫీజులు సకాలంలో చెల్లింపు
- ప్రాజెక్టు సీఈవో అంబటి మురళీకృష్ణ

నెహ్రూనగర్ : గుంటూరు నగరంలో బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా నిర్మిస్తున్న గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ సముదాయంపై అసత్య ప్రచార తగదని సంస్థ సీఈవో అంబటి మురళీకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 2015లో ఈ నిర్మాణం కోసం గుంటూరు నగరపాలక సంస్థ నుంచి 2 సెల్లార్స్, జీ ప్లస్ 4 ఫ్లోర్స్, బిల్డింగ్ పర్మిషన్ తీసుకొని సంబంధిత ఫీజులు చెల్లించామన్నారు. తర్వాత సదరు ప్లాన్ ను 2020లో సవరణ చేసుకొని 2 సెల్లార్, 1 స్టిల్ట్, జీ ప్లస్ 14కు అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. 2024లో ప్లాన్ రివైజ్ చేసుకొని సంబంధిత ఫీజులు చెల్లించామని పేర్కొన్నారు. నిర్మాణ సముదానికి సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ అడిగిన ఇతర ఎన్‌ఓసీలను కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ఇటీవల రివైజ్డ్ ప్లాన్ అప్రూవల్ తర్వాత రైల్వే ఎన్‌ఓసీ రివైజ్ చేసుకొని 15 ఫ్లోర్స్‌కు తీసుకోవాలని సూచిస్తూ నగరపాలక సంస్థ అధికారులు షార్ట్ ఫాల్‌లో పెట్టారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ శాఖలో షార్ట్ ఫాల్స్ పెట్టడం సర్వసాధారణమని, అనేకమంది బిల్డర్లు షార్ట్‌ఫాల్స్‌కు సరిదిద్దుకోవడం కూడా అంతే సర్వసాధారణం అని పేర్కొన్నారు. ఈ క్రమంలో గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. వ్యతిరేక ప్రచారాల్లో వాస్తవం లేదని ఆయన కొట్టిపారేశారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు అన్ని రకాల ఫీజులు చెల్లించి అనుమతులు తెచ్చుకున్న తరువాత అక్రమాలకు ఆస్కారమే ఉండదని ఆయన వివరించారు.





పట్టాలు తప్పిన ప్యాసింజర్ రైలు

గుండె గుభేల్.. చూస్తే మాక్ డ్రిల్..

రైలు బోగీలు ఒకదానిపై ఒకటి ఎక్కాయి. దూరం నుంచి అది చూసిన ప్రజానీకం భయపడిపోయారు. రైలు ప్రమాదం జరిగిందేమో అనుకొని పరుగులు తీశారు. మరో వైపు ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కూడా క్షణాల్లో ప్రత్యక్షమయ్యారు. క్షతగాత్రులను, ప్రయాణికులను బయటకు తీసుకువస్తున్నారు. ఇదంతా రైల్వే ప్రమాదాలపై ఉన్నతాధికారులు చేపట్టిన మాక్ డ్రిల్ అని తెలుసుకొని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం ఈ డ్రిల్‌ను నిర్వహించారు. విజయవాడలోని ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్‌కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్ మహ్మద్ అస్లాం, రైల్వే ప్రధాన కార్యాలయం నుంచి పీసీఎస్‌వో కె. వెంకటరమణారెడ్డి, సీఎంపీ ధర్మేంద్రకుమార్, డిప్యూటీ సీఎండీ ఎం. సుజి, డిప్యూటీ సీఎస్‌వో ఎ.స్వరాజ్‌కుమార్‌లు పర్యవేక్షించారు. డీఆర్‌ఎం ఎం రామకృష్ణ, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ బి విజయకీర్తి, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ ఎం దినేష్‌కుమార్, డీసీఎం సీహెచ్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు. – వేజండ్ల(చేబ్రోలు)



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం ఎం. రామకృష్ణ

రైల్వేకు కీలకం.. లోడింగే నరకం!

- నెలకు 25- 30 వ్యాగన్లు అన్‌లోడింగ్
- నిత్యం వందల లారీలకు లోడింగ్
- కనీస వసతుల్లేక డ్రైవర్లు, ఓనర్ల అవస్థలు

తాడేపల్లి రూరల్: రాజధాని ముఖద్వారమైన తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ పరిధిలో అతి కీలకమైన రైల్వే గోడౌన్‌లు ఉన్నాయి. సుమారు 6 జిల్లాలకు సంబంధించిన ఎరువులు, చిరు ధాన్యాలు ఇక్కడే దిగుమతి అవుతాయి. లారీల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఇక్కడికి దిగుమతైన ఎరువులు లారీల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, ఎన్‌టీఆర్, కృష్ణా తదితర జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడి నుంచి లారీల ద్వారా తరలిస్తున్నారు. పశువుల దాణాల్లో ఉపయోగించే రా మెటీరియల్ కూడా సరఫరా అవుతోంది. కానీ భారీగా గుంతలు పడిన రహదారులతో లోడింగ్ లారీల యజమానులు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు 20 నుండి 30 వ్యాగన్ల సరకు దిగుతోంది. 250 మంది ముఠా కార్మికులు, వెయ్యి మంది లారీ ఓనర్లు, 2,500 మంది కార్మికులు గోడౌన్ల కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్నారు. కనీస సౌకర్యాలు మాత్రం లేవు. రెండు అడుగుల నుంచి ఐదు అడుగుల లోతులో లోడింగ్ వద్ద ఏర్పడిన గుంతలు వారికి నరకం చూపుతున్నాయి. టైర్లు స్లిప్ కావడం , ఆ సమయంలో రాళ్లు తగలడంతో పగిలిపోతున్నాయి. కట్టలు, మెయినాజిల్, స్టీరింగ్ దిమ్మ విరిగిపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్కొక్కసారి లారీ వాలిపోవడంతో సరకు నేలపాలు అవుతోంది. గతంలో స్థానిక ప్రజాప్రతినిధులను లారీ యూనియన్ యజమానులు కలవగా 60 లారీల మట్టి తోలారు. రైల్వే అధికారులు కనీసం పట్టించుకోలేదు. గోడౌన్లను వెంటనే మరమ్మతులు చేయించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని రైల్వేశాఖ దృష్టికి తీసుకువెళ్లి తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు.



దిగబడిపోయిన లారీ



గోతిలో దిగబడిన లారీ

మరమ్మతులకు రూ.వేల ఖర్చు



లోడింగ్ చేసుకుని బురదలో, గోతుల్లో బయటకు వెళ్లే సమయంలో లారీ కట్టలు, స్టీరింగ్ కొమ్మ విరిగిపోవడం, బెలూన్స్ పగిలిపోవడం సాధారణమైంది. మెకానిక్ వచ్చి మరమ్మతులు చేయాలంటే ఖర్చు భారీగా అవుతోంది. లోడింగ్‌కు రాకపోతే అసోసియేషన్‌లో పేరు తొలగిస్తామంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రావాల్సి వస్తోంది.

– బత్తుల ప్రభుదాసు

లోడింగ్‌కు రావాలంటే నరకం



లారీ తీసుకుని రైల్వే గోడౌన్‌కు లోడింగ్‌కు రావాలంటే నరకం కనిపిస్తోంది. రోడ్డు సరిగ్గా లేక, నీళ్లు నిలబడి టైర్లు స్లిప్ అయిపోతున్నాయి. లోడింగ్ పెట్టడానికి అరగంటపైనే పడుతోంది. బయటకు వెళ్లాలంటే చాలా జాగ్రత్తగా ఉండాల్సి వస్తోంది. మరోసారి తాళ్లు బిగించాల్సి వస్తోంది. ఆ బురదలో సీసా పెంకులు ఉండి క్లీనర్లకు కాళ్లు కోసుకుపోతున్నాయి.

– కొట్టిమక్కల శ్రీనివాసరావు

రైల్వే అధికారులతో చర్చించాలి



ఈ గోడౌన్ నుంచి ఆరు జిల్లాలకు ఎరువులు తరలిస్తారు. రహదారి సరిగ్గా లేక డ్రైవర్లు, ఓనర్లు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మత్తులు నిర్వహించాలంటే రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చొరవ చూపాలి. రైల్వేశాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలి.

– వంగ దేవ, తాడేపల్లి లారీఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

క్లుప్తంగా

14న తెనాలి ఐటీఐ కళాశాలలో అప్రెంటీస్ మేళా

తెనాలి అర్బన్: తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 14న పీఎం నేషనల్ అప్రెంటీస్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రావి చిన్నవెంకటేశ్వర్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. 15 ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు తమ బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్‌లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫొటోలతో ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ నెంబర్ 90144 91772, 99598 28100 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డీఎస్సీ శిక్షణకు అవకాశం

నెహ్రూనగర్: సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 5,050 మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సోషల్ వెల్ఫేర్ డీడీ డి.మధుసూదన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేయబడిన శిక్షణ కేంద్రాల్లో, ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్స్‌లో ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. దీని కోసం దరఖాస్తు చేసుకునే సంస్థలు కనీసం రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లకు కోచింగ్ ఇచ్చి ఉండాలన్నారు. గత రిక్రూట్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చిన వారిలో కనీసం 100 మంది ఉద్యోగానికి ఎంపికై ఉండాలన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్‌లో ఉద్యోగ నియామకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్లు-3, ఫార్మసిస్టులు-11, డేటా ఎంట్రీ ఆపరేటర్లు-11, శానిటరీ అటెండర్లు-15 కలిపి మొత్తం 40 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే గుంటూరు. ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులకు డీడీ జత చేసి గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఈనెల 16 నుంచి 30వ తేదీలోపు అందజేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలు రూ. 100, బీసీ, ఓసీలు రూ. 300 వంతున డి.డి. చెల్లించి దరఖాస్తుకు జత చేయాలని పేర్కొన్నారు. ఓ.సి అభ్యర్థులు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో, దరఖాస్తు సమర్పించేటప్పుడు అదనంగా రూ. 500 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మిగిలిన వివరాలకు వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

సేవలో వహ్వా..లంటీర్లు!

- చదువుతోపాటు సమాజసేవలోనూ భాగస్వామ్యం
- గ్రామాలను దత్తత తీసుకుంటున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



విజయవాడలో వరద బాధితుల సహాయార్థం నిత్యావసర సరుకుల కిట్లను సిద్ధం చేసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు (ఫైల్)



విజయవాడలో వరద బాధితుల సహాయార్థం బయలుదేరుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్ డిగ్రీ విద్యార్థులు సమాజ సేవకు నడుం బిగిస్తున్నారు. చదువుతోపాటు సామాజికంగా చైతన్యవంతులైన విద్యార్థులు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లో వలంటీర్లుగా సమాజానికి చేతనైన సేవ చేస్తున్నారు. గుంటూరు నగరంలోని వివిధ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా ఉన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గ్రామాలు, పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు పచ్చదనం, పరిశుభ్రత, విద్య, వైద్యం, సామాజికంగా వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చేస్తున్న కృషి మరువలేనిది. కళాశాలల యాజమాన్యాలు సైతం విద్యార్థులను ఎన్ఎస్ఎస్ దిశగా ప్రోత్సహిస్తున్నాయి. కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్‌లో చేరే విధంగా పర్యవేక్షిస్తూ, సామాజికసేవా భావాన్ని పెంపొందిస్తున్నాయి. ముందుగా విద్యను అభ్యసిస్తున్న కళాశాల నుంచే సామాజికసేవా భావానికి పునాది వేస్తున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో ప్రజలకు చేరువై సేవ చేయడంలో వీరి పాత్ర ఎంతో కీలకం. ఇటీవల విజయవాడ నగరంలో సంభవించిన వరదల్లో ఎంతో మంది కళాశాల విద్యార్థులు అక్కడి బాధితులకు అండగా నిలిచి, సేవలందించారు. శిబిరాల్లో రక్తదాతలుగా ప్రాణాన్ని నిలబెడుతున్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా సేవలందిస్తున్న విద్యార్థుల మనోగతం వారి మాటల్లోనే...

దేశభక్తి అలవడుతుంది..



జాతీయ సేవా పథకంలో ప్రవేశించిన విద్యార్థులకు విద్యతోపాటు సామాజిక సేవా భావాలు, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అలవడతాయి. జీవితంలో ఉపాధి మార్గాల్లో స్థిరపడినప్పుడు అందరితో కలిసి మెలిసి ఉండే స్వభావం పెరుగుతుంది. ఆపదలో ఉన్న వ్యక్తికి సహాయం అందిస్తే జీవితంలో ఎంతో ఆత్మ సంతృప్తి ఉంటుంది. గ్రామాలను దత్తత తీసుకుని, అక్కడ సేవలందించే సమయంలో వెలకట్టలేని సంతృప్తి లభిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలతో సత్సంబంధాలను నెలకొల్పడంతోపాటు వారి జీవన విధానం, సామాజిక, ఆర్థిక పరిస్థితులు విద్యార్థులకు తెలుస్తాయి. మానవీయ విలువలను కోల్పోతున్న యువతరానికి మంచి భావాలు, క్రమశిక్షణ, గ్రామీణ సంబంధ బాంధవ్యాలను, సంస్కృతీసంప్రదాయాలను మరచిపోకుండా చేస్తుంది.

– డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి, టీజేపీఎస్ కళాశాల

జీవితాన్ని మార్చేసింది



ఎన్ఎస్ఎస్ శిక్షణ అనేది విద్యార్థి జీవితంలో ఒక భాగంగా ఉంది. క్రమశిక్షణతోపాటు బాధ్యతాయుతమైన ప్రవర్తన అలవర్చడంలో సాయం చేస్తుంది. ఎన్ఎస్ఎస్ ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. ఇతరులకు సాయపడటం, నైపుణ్యత, ఎటువంటి సమస్యలైనా ఎదుర్కొనే స్వభావం, నాయకత్వ లక్షణం, సరైన సమయంలో తగిన నిర్ణయాలు తీసుకోవటానికి తోడ్పడుతుంది. కెరీర్‌ను తీర్చిదిద్దుకోవడంతోపాటు ఇతరులతో భాగస్వామిగా పనిచేయడం వంటి విషయాలు ఉన్నాయి.

– నరేష్, డిగ్రీ ప్రథమ సంవత్సరం

సామాజిక బాధ్యతగా భావిస్తున్నా



సామాజిక బాధ్యత, సేవా భావాలను పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ శిక్షణ దోహదం చేస్తోంది. క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ప్రవర్తన, నైపుణ్యం, మంచి స్వభావంతోపాటు నాయకత్వ లక్షణాలు వంటి విషయాలను ఎన్ఎస్ఎస్ ద్వారా నేర్చుకుంటున్నాను. మొక్కలు నాటడంతోపాటు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాలు, వయోజన విద్య ఆవశ్యకత, జనాభా నియంత్రణ వంటి అంశాల్లో ప్రజలను చైతన్యపరుస్తున్నాం. క్యాంపస్, కమ్యూనిటీ మధ్య అనుసంధానంగా ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నాం.

– ఐశ్వర్య, బీబీఏ తొలి సంవత్సరం

మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆగడాలపై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: మైక్రో ఫైనాన్స్ కంపెనీల ఆగడాలపై జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం ఆరా తీసినట్లు తెలిసింది. ప్రత్తిపాడు వడ్డెర కాలనీకి చెందిన మహిళలకు గుంటూరుకు చెందిన మైక్రో ఫైనాన్స్ సంస్థలు రుణాలిచ్చి, ఈఎంఐలు కట్టలేదని వేధిస్తున్నాయి. అర్ధరాత్రి ఇళ్లకు వచ్చి వేధిస్తున్నారని, రుణం కట్టలేకపోతే చచ్చిపోవాలని, ఇన్సూరెన్స్ క్లయిమ్ చేసుకుని రుణాలు రద్దు చేస్తామంటూ ప్రతినిధులు దాష్టీకానికి పాల్పడుతున్నారంటూ బుధవారం 'సాక్షి'లో 'మళ్లీ పల్లెల్లో వడగ' శీర్షికన ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ స్పందించినట్లు సమాచారం. డీఆర్డీఏ పీడీని ఈ విషయమై ప్రశ్నించి, పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించినట్లుగా తెలిసింది.

తక్కువ ధరకే వంట నూనె అందించేలా చర్యలు

గుంటూరు వెస్ట్: వంట నూనెల దిగుమతి విషయంలో కేంద్రం సుంకాలను పెంచడంతో లీటర్‌కు రూ.12 నుంచి రూ.16 వరకు పెరిగాయని డీఎస్ఓ కోమలి పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత మార్కెట్‌లో రుచి గోల్డ్ పామాయిల్ లీటర్ రూ.135, ఫ్రీడమ్ సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.140 వరకు విక్రయిస్తున్నారని చెప్పారు. ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్‌తో చర్చించి తాము రుచి గోల్డ్ పామాయిల్ లీటర్ రూ.120, ఫ్రీడమ్ సన్ ఫ్లవర్ ఆయిల్ రూ. 130 చొప్పున విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రైతు బజార్, చుట్టగుంట రైతు బజార్‌తోపాటు బండ్లబజార్ దుకాణాల్లో గురువారం నుంచి పైన తెలిపిన ధరలకు విక్రయాలు జరుగుతాయని తెలిపారు.

జీఎంసీ ఉత్తర్వులపై హైకోర్టుకు చిరు వ్యాపారులు

- షాపుల లీజు కొనసాగేలా ఆదేశాలివ్వాలని పిటిషన్
- నేడు విచారణ చేపట్టనున్న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం

సాక్షి, అమరావతి: గుంటూరు పట్టణం, కొరిటెపాడు కూరగాయల మార్కెట్‌లోని షాపులను ఖాళీ చేయాలంటూ గత నెల 26న గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ (జీఎంసీ) అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. చిరు వ్యాపారుల మరియు చేతివృత్తుల సంక్షేమ సంఘంతోపాటు అక్కడ వ్యాపారం చేసుకుంటున్న పలువురు కోర్టుకెళ్లారు. జీఎంసీ ఉత్తర్వులను రద్దు చేయాలని, తమకు లీజుకిచ్చిన షాపుల్లో కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, జీఎంసీ కమిషనర్, అదనపు కమిషనర్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు గురువారం విచారణ జరపనుంది. 2004 నుంచి తాము కొరిటెపాడు లైబ్రరీ సెంటర్ రోడ్డు వెంబడి బండ్లపై కూరగాయలు విక్రయించేవారమని, తమ నుంచి జీఎంసీ పన్ను కూడా వసూలు చేసిందన్నారు. తరువాత ఆ పక్కనే ఉన్న కూరగాయల మార్కెట్‌లో తమకు షాపులకు లీజుకు కేటాయించారని తెలిపారు. వాటిని తాము సొంత ఖర్చుతో నిర్మించుకున్నామని వివరించారు. 2004-05 నుంచి జీఎంసీ అధికారులు ఒక్కో షాపునకు నెలకు రూ.2,350 చొప్పున లీజు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. కొంత సొమ్ము వసూలు చేసి షాపులను క్రమబద్ధీకరించేందుకు అనుమతినిస్తూ జీఎంసీ పాలకవర్గం 2009-10లో తీర్మానం కూడా చేసిందన్నారు. ఈ లీజు కాలం 25 సంవత్సరాలు పూర్తయినందున షాపులను ఖాళీ చేయాలంటూ అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారని, అందుకు తాము సమాధానం కూడా ఇచ్చామన్నారు. 2004-05లో ఒప్పందం కుదిరిందని, ఇంకా 25 ఏళ్లు పూర్తి కాకున్నా కూడా అధికారులు ఖాళీ చేయాలంటున్నారని పేర్కొన్నారు. 2030 వరకు తమకు గడువు ఉందన్నారు. ఈ షాపులే తమకు జీవనాధారమని, వాటిని ఖాళీ చేయిస్తే రోడ్డున పడుతామని వ్యాపారులు తమ పిటిషన్‌లో కోర్టుకు విన్నవించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పిలుపు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు. వేదికపై మోదుగుల, నూరి ఫాతిమా, బాలవజ్రబాబు తదితరులు

పట్నంబజారు: డివిజన్ స్థాయి నుంచి క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. బృందావన్ గార్డెన్స్‌లో పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం పార్టీ తూర్పు నియోజకవర్గ ముఖ్యనేతల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ... అన్ని విధాలుగా కార్యకర్తలను సిద్ధం చేస్తామన్నారు. వారికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టం అవుతోందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టినా, దాడులకు తెగబడ్డా తిరగబడడం తథ్యమన్నారు. గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి బలమైన నాయకత్వాన్ని పెంచడం ద్వారానే రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాడేందుకు సంసిద్ధంగా ఉంటుందన్నారు. ఎన్నికల్లో ఓడిపోయామనే బాధ పక్కన పెట్టి ఎల్లప్పుడూ ప్రజా పక్షమేనన్న అంశాన్ని గుర్తించి, ముందుకు సాగాలని సూచించారు. అధికారంలో ఉన్నా, లేకున్నా.. ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడమే అందరి బాధ్యత అన్నారు. గ్రామ, డివిజన్ స్థాయి నుంచి నిర్మాణాత్మకమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేసేందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని గుర్తుచేశారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. పార్టీ నగర అధ్యక్షుడు, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ.. గుంటూరు నగరంలో పటిష్ట నాయకత్వంలో కార్యకర్తల సైన్యం వైఎస్సార్ సీపీకి ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధిష్టానం ఏ పిలుపు ఇచ్చినా దాన్ని శిరసా వహిస్తూ ముందుకు సాగుతామన్నారు. పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం తమ పాలనలో తప్పిదాలను కప్పిపుచ్చుకొనేందుకు రోజుకో అంశాన్ని తెరపైకి తీసుకొచ్చి వీధి నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీకి ఎనలేని ప్రజాదరణ ఉందన్నారు. కచ్చితంగా భవిష్యత్తులో మంచి జరుగుతుందన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నియోజకవర్గ స్థాయి నేతలు, అనుబంధ విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోగా రామలక్ష్మి బాధ్యతల స్వీకరణ



రేపల్లె రూరల్: రేపల్లె ఆర్డీవోగా నేలపు రామలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా పత్తికొండ ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీపై రేపల్లె వచ్చారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన హేలా షారోన్ ఉయ్యూరుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామలక్ష్మి మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. పలువురు తహసీల్దార్‌లు, ఇతర రెవెన్యూ సిబ్బంది, అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సాగర్ కాలువలో మృతదేహం

మార్టూరు: మండలంలోని జంగమహేశ్వరపురం రెవెన్యూ పరిధిలోని సాగర్ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు బుధవారం వెలికి తీయించారు. హెడ్ కానిస్టేబుల్ యు. కోటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. జంగమహేశ్వరపురం సమీపంలోని టి. జంక్షన్ వద్ద సాగర్ కాలువలో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందించారు. వలపర్ల వీఆర్వో వి. అశోక్ సమక్షంలో మృతదేహాన్ని కాలువ నుంచి వెలికి తీయించి పరీక్షించారు. సుమారు 40 సంవత్సరాల వయసుగల వ్యక్తి మృతదేహంపై ఎలాంటి దుస్తులు, ఇతర ఆనవాళ్లు లేవని చెప్పారు. వీఆర్‌ఓ అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



గుంతకల్లు: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసి బంగారం సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. స్థానిక రైల్వే జంక్షన్‌లోని జీఆర్‌పీ పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన సింగంరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తరచుగా రైళ్లలో ప్రయాణిస్తూ నిద్రలో ఉన్న ప్రయాణికుల బ్యాగులను అపహరించడం, కిటికీ వద్ద కూర్చొన్న మహిళల మెడలోని బంగారు గొలుసులు లాక్కెళ్లడం వంటి చోరీలకు పాల్పడేవాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా రైల్వే పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు జీఆర్‌పీ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులు వెలుగు చూశాయి. నిందితుడిని అరెస్ట్ చేసి, 60 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు.


ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చిలకలూరిపేట: ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు చెప్పారు. ఎస్టీయూ సమావేశం సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వహించనున్న క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై చర్చించాలని కోరారు. 12వ పీఆర్‌సీ కమిషన్ చైర్మన్ నియామకంతో పాటు 30 శాతం మధ్యంతర భృతి, పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీ బకాయిల చెల్లింపుపై దృష్టి సారించాలన్నారు. ఎస్టీయూ రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తు గడువు పొడిగింపు

నెహ్రూనగర్: ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తు అవకాశం కల్పించింది. ఈ గడువును 11వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఆదేశాలు జారీ అయ్యాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్ బుధవారం తెలియజేశారు. గుంటూరు జిల్లాలో 127, పల్నాడు జిల్లాలో 129 షాపులకు నోటిఫికేషన్ వచ్చిందని పేర్కొన్నారు. బుధవారం రాత్రి వరకు గుంటూరుకు 2,944, పల్నాడుకు 1,635 దరఖాస్తులు అందాయన్నారు. గడువును 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు సర్కారు పొడిగించిందని, రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఎవరైనా ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 14వ తేదీన ఆయా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో లాటరీ తీసి కేటాయిస్తారని, 16 నుంచి షాపుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

యార్డుకు 37,958 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 37,958 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 36,741 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,700 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 16,900 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,300 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 23,585 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

పేరుకే పౌష్టికం.. టీచర్లపై దాష్టీకం!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం కూడా సక్రమంగా పంపిణీ చేయడం లేదు. ఈ ప్రభుత్వ పాలన ఏ విధంగా ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి నెలా 1వ తేదీ నుంచి పౌష్టికాహారం లబ్ధిదారులకు పంపిణీ చేసేవారు. ప్రీ స్కూల్ చిన్నారులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పెట్టే అన్నం, ఆకుకూర పప్పు, సాంబారు, పులి హోర, ఉడకబెట్టిన కోడిగుడ్డు పెట్టే క్రమంలో ఎటువంటి రాజీ పడలేదు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు 16 వేల మంది చిన్నారులను పస్తులు పెడుతోంది.

- అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అధ్వానం
- బియ్యం లేక ప్రీ స్కూల్ పిల్లలు పస్తులు
- రేషన్ డీలరు నుంచి అప్పుగా తీసుకోవాలని ఆదేశం
- స్టాక్ గురించి అడిగితే టీచర్లపై మండిపాటు
- సాక్షి వివరణ కోరడంతో హడావుడిగా సరఫరా



గుంటూరు అర్బన్ సీడీపీఓ కార్యాలయం

నెహ్రూనగర్: ప్రతి నెల బాలింతలకు, గర్భిణులకు ఇవ్వాల్సిన బియ్యం, నూనెలు 9వ తేదీ వచ్చినా ఇంతవరకు రాలేదు. దీనికి తోడు అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 – 6 ఏళ్లలోపు చిన్నారులకు పెట్టే పౌష్టికాహారం బియ్యం, నూనె లేకపోవడంతో వారిని పస్తులు ఉంచాల్సి వస్తోంది. సుమారు 16 వేల చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉసూరుమంటూ వెనక్కి తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది.

రేషన్ డీలర్ వద్ద బియ్యం తెచ్చుకోండి

గుంటూరు అర్బన్ పరిధిలో 321 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఏ సెంటర్‌కు కూడా బియ్యం, నూనె ఇంత వరకు రాలేదని అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. దీనికి తోడు పోయిన నెల రావాల్సిన కందిపప్పు ఈ నెల ఇచ్చారని చెబుతున్నారు. ప్రస్తుతానికి చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా రేషన్ డీలర్ వద్ద బియ్యం తెచ్చుకోవాలని అధికారులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు స్టాక్ వచ్చిన తరువాత వాటిని డీలర్లు వాడుకునేలా చూద్దామని సూపర్‌వైజర్లు చెప్పడం గమనార్హం. మళ్లీ రేషన్ డీలరు దగ్గరకు వెళితే నో స్టాక్ బోర్డు ఉంటోంది. ఇవ్వబోమని డీలర్లు చెబుతున్న సమాధానాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా అంగన్‌వాడీ టీచర్లకు నిరాశ ఎదురైందని తెలిసింది. మీ సొంతంగా ఖర్చు పెట్టుకుని బియ్యం తెచ్చుకొని... స్టాక్ వచ్చిన తరువాత ఆ బియ్యన్ని తీసుకోవాలని ఉచిత సలహాలు ఇస్తుండటంతో ఐసీడీఎస్ అధికారులపై అంగన్‌వాడీ టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సరిపడా రాని పౌష్టికాహారం

ప్రతి నెల పౌష్టికాహారం సరిపడా రావడం లేదని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు. కొత్తగా తీసుకోవాలంటే పోషణ ట్రాకర్ యాప్‌లో ప్రతి నెల 25 నుంచి 1వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకున్న వారికి అందేది. ఈ లోపు ఎవరైనా వచ్చినా వారికి 25వ తేదీ తరువాత అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పడంతో నిరాశగా ఎదురు తిరగాల్సిన పరిస్థితి. బియ్యం ఆలస్యంగా రావడంపై ఐసీడీఎస్ అధికారులను సాక్షి వివరణ కోరగా హడావుడిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం సరఫరా చేసినట్లు తెలుస్తోంది.

గుంటూరు అర్బన్ పరిధిలో	
అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య:	321
0 - 6 నెలల లోపు చిన్నారుల సంఖ్య:	2,927
సంవత్సరంలోపు పిల్లల సంఖ్య :	3,947
1 - 3 సంవత్సరాలలోపు బాలలు:	15,373
3 - 6 ఏళ్లలోపు పిల్లల సంఖ్య:	15,958

అందరికీ పంపిణీ చేస్తాం

రేషన్ డీలర్ల వద్ద నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు రావాల్సిన బియ్యం కొంత ఆలస్యమైంది. రేషన్ డీలర్లతో మాట్లాడగా బుధవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం పంపిణీ చేశాం. ఇప్పటికే కొంత మంది లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాం. గురువారం నుంచి మిగతా లబ్ధిదారులకు కూడా పూర్తిస్థాయిలో పంపిణీకి చర్యలు తీసుకుంటాం.

– టి. కృష్ణవేణి, ఐసీడీఎస్, సీడీపీఓ